క్లుప్తంగా

చౌడేశ్వరీదేవికి పూజలు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: మండల పరిధిలోని వీరాపురం పంచాయతీ హాస్పేన్‌పురంలో వెలసిన చౌడేశ్వరీదేవి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి దీపికను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

పెనుకొండ: పెనుకొండ డీఎస్పీగా నరసింగప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నరసింగప్ప బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడటానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఐలు, సీఐలు, సిబ్బంది నూతన డీఎస్పీని కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మడకశిర: మండలంలోని టీడీపల్లి వద్ద సోమవారం దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 318 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ శంకర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎంబీపీపీ సీఐ గురునాథరెడ్డి కూడా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా స్కూటీలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. స్కూటీని కూడా సీజ్ చేశామన్నారు. కర్ణాటక మద్యం ప్యాకెట్ల విలువ దాదాపు రూ.15 వేలు ఉంటుందని చెప్పారు.

ఏఐటీయూసీలో చేరిక



ఏఐటీయూసీలో చేరుతున్న రమేష్

పెనుకొండ: సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ సోమవారం సీపీఐ అనుబంధమైన ఏఐటీయూసీలో చేరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీలో చేరారు. నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి విద్యతో బుద్ధి వికాసం



గాంధారి విద్య అభ్యసించిన చిన్నారులతో తల్లులు

పావగడ: గాంధారి విద్య నేర్చుకున్న చిన్నారుల్లో బుద్ధి వికాసంతో పాటు ఆత్మ విశ్వాసం, ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని స్థానిక బ్రైట్ ఫ్యూచర్ శిక్షణ కేంద్రం ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీధర్ గుప్త తెలిపారు. స్థానిక శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొదటి దశ శిక్షణలో 14 మంది మెరుగైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న పిల్లల కళ్లకు గంతలు కట్టి వారి చేతులకు అందించిన బంతుల రంగులను గుర్తించడం, చిత్రాల పేర్లను చెప్పడం వంటివి ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

సోమందేపల్లిలో వర్షం



వెలిదడకలలో వర్షం కురుస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని వెలిదడకల, తుంగోడు కేతగాని చెరువు, గుడిపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా వర్షం కురువడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

మారెమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

మడకశిర: పట్టణంలో వెలసిన కనుమ మారెమ్మ జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కనుమ మారెమ్మకు జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనుమ మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈఉత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

సాక్షిబృందం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో వివిధ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు.



హిందూపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులు



మడకశిరలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: సమ సమాజ స్థాపకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఈరలక్కప్పతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అన్ని వర్గాలకు సమాన హక్కుల కోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వైఎస్ జగన్ హయాంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలైతే... కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తిలోదకాలిచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ విభాగం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎన్ కృష్ణమూర్తి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజ్, కురుబ శేషు, హనుమంతరాయప్ప, నాగభూషణ్‌రెడ్డి, రంగనాథ్, మైనార్టీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఎమ్మెల్యే నివాళి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వివిధ సంఘాల నాయకులు కూడా అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

చిలమత్తూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హిందూపురం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి దీపిక పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘం నేతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి



చౌళూరులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి



పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



గోరంట్ల: ఎంపీపీ ప్రమీల ఆధ్వర్యంలో..



పావగడ: అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్



పెనుకొండ: అంబేడ్కర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి



గుడిబండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



అమరాపురం: అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ ప్రజా సంఘాలు



రొళ్లలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



సోమందేపల్లి మండలం పందిపర్తి పంచాయతీ కార్యాలయంలో..



లేపాక్షి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అగళి: అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఉదయపావని



హిందూపురం: కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

- ట్రైనీ డీఎస్పీ ఉదయపావని

మడకశిర: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగేష్ సూచించారు. సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం అధికారి విజయ్‌కుమార్‌తో కలిసి వారు అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమదాలపై మరింత అప్రమత్తత అవసరమన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101 కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ప్రజలు కూడా అగ్ని ప్రమాదాలు జరకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ పేర్కొన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 20 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం అగ్ని ప్రమాదలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే 08556 220888 లేదా 100కు ఫోన్ చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌కు తీవ్ర గాయాలు



నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిలోని ఇరిగేపల్లి గొల్లహట్టి క్రాస్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయ పడ్డారు. స్థానికుల వివరలు మేరకు.. రొళ్ల మండలం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి శిర నుంచి రొళ్లకు వెళ్తున్నారు. అలాగే గొల్లహట్టి గ్రామానికి చెందిన మైక్ సెట్ తిమ్మరాజు అగళికి వెళ్తున్నారు. ఇరిగేపల్లి గొల్లహట్టి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన నరసింహారెడ్డిని స్థానికులు కర్ణాటక రాష్ట్ర తుమకూరుకు తరలించారు. తిమ్మరాజు కూడా గాయాలపాలయ్యాడు. ఏఎస్ఐ బషీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నరసింహారెడ్డికి పరామర్శ

రొళ్ల: తుమకూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహారెడ్డిని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు సోమవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులను అడిగి నరసింహారెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట గుడిబండ మండలం మందలపల్లి సర్పంచ్ అశ్వత్థ, వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి, నాయకులు మహంతేష్, యంజార్‌గౌడు, నాగరాజు, శేఖర్ తదితరులున్నారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

మావటూరులో గ్రామసభ

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు, శెట్టిపల్లి గ్రామాల్లో పంచాయతీ అధికారులు సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ముందుగా అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై చర్చించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి తీర్మానాలు చేసినట్లు సర్పంచ్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీలు శ్రీరాములు, వెంకటేష్ నాయక్, సర్పంచ్ శ్యామలా బాయి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్



సీసీ కెమెరాల పని తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే , డీఎస్పీ తదితరులు

మడకశిర: పట్టణంలో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. పట్టణంలో నేరాలను నివారించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను మడకశిర పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు ఎలా పని చేస్తున్నాయో సోమవారం డీఎస్పీ నరసింగప్ప ద్వారా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పోలీస్‌స్టేషన్ సందర్శించి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు తదితర నేరాలను నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. పట్టణం పూర్తిగా నిఘా నేత్రం పరిధిలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, టౌన్ సీఐ నాగేష్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏఈ పోస్టు భర్తీ ఎన్నడో?

- ఇబ్బందులు పడుతున్న విద్యుత్ వినియోగదారులు



అగళిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

అగళి: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ పోస్టుగా ఎనిమిది నెలలుగా ఖాళీగానే ఉంది. మూడు నెలల క్రితం ఏఈగా నాగరాజు నియమించారు. ఆయన బాధ్యతలు తీసుకొని 20 రోజులు కూడా పని చేయకుండానే సెలవుపై వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అప్పటి నుంచి ఇక్కడికి కొత్త వారిని నియమించలేదు. ఇన్‌చార్జ్‌ని కూడా నియమించకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు విషయంలో టీడీపీ నాయకుల ఒత్తిడితోనే ఏఈగా వచ్చిన నాగరాజు వెళ్లిపోయారని రైతులు చెబుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సీనియార్టీ ప్రకారం కాకుండా టీడీపీ నాయకులు చెప్పిన వారికే ఇవ్వాలని ఆయనపై ఒత్తిడి తెచ్చారంటున్నారు. రెగ్యుల్ ఏఈ లేకపోవడంతో రైతులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కొత్తగా కనెక్షన్లు కావాల్సిన వారితో పాటు ఏవైనా సాంకేతిక సమస్యలు వస్తే ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే కింది స్థాయి విద్యుత్ సిబ్బంది తీరు కూడా సరిగాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా



కొట్నూరులో మున్సిపాలిటీ స్థలంలో అక్రమంగా షెడ్లు వేస్తున్న దృశ్యం

- విలువైన మున్సిపాల్టీ స్థలంలో యథావిధిగా టీడీపీ నేత షెడ్ల నిర్మాణం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని కొట్నూరులో టీడీపీ నేత హిందూపురం మున్సిపాలిటీకి చెందిన గ్రామ కంఠం భూమిలో అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారు. సర్వే నంబరు 259–1 సీలో 18 సెంట్ల మున్సిపాలిటీ స్థలాన్ని ఓ టీడీపీ నేత ఆక్రమించుకున్నారు. వెను వెంటనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలిసి కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు ఆపేశారు. అయితే సోమవారం మళ్లీ యథావిధిగా నిర్మాణాలు సాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు టీడీపీ నేత ఇద్దరు మహిళలను అడ్డుగా ఉంచి తమ నిర్మాణాలను చేపట్టారంటున్నారు. ఆక్రమణలపై మున్సిపాలిటీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోగా సోమవారం నిర్మాణాలను ఆపే ప్రయత్నం చేయలేదు. మున్సిపాలిటీ స్థలంలో నిర్మించిన షెడ్‌లను ఆదిలోనే తొలగించి ఉంటే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదని చెబుతున్నారు.

కోత దశలో రబీ పంటలు



కోత దశలో ఉన్న వరి పంట



ఆశాజనకంగా ఉన్న రాగి పంట

మడకశిరరూరల్: రబీలో బోరు బావుల కింద రైతులు సాగు చేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఖరీఫ్ వేరుశనగ పంటను సాగు చేసి వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రం నష్టపోయారు. రబీ పంటలపై ఆశలు పెట్టుకుని అప్పులు చేసి బోరు బావుల కింద రాగి, వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటను సాగు చేశారు. పంటలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొస్తే చేసిన అప్పుల్లో కొంత వరకూ తగ్గించుకోవచ్చంటున్నారు. వేరుశనగ పంట కన్నా వరి, మొక్కజొన్న, రాగి పంటల దిగుబడి బాగానే వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం లేకపోయిన అప్పులు చేసి రబీలో సాగు చేసిన పంటలు చేతికందుతుండడంతో రైతులకు ఊరటనిస్తుంది.